క్లుప్తంగా

కనకదుర్గమ్మకు మకర తోరణం సమర్పణ



మకర తోరణం అలంకరణలో అమ్మవారు

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరంలో గోదావరి కాల్వ గట్టున ఉన్న బాల కనక దుర్గమ్మ అమ్మవారికి వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు, వార్డు సభ్యుడు ఘంటసాల సతీష్‌ల ఆధ్వర్యంలో 13 కేజీల ఇత్తడి మకర తోరణాన్ని శుక్రవారం సమర్పించారు. అర్చకుడు బాబీశర్మ అమ్మవారి విగ్రహం వద్ద మకర తోరణం ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. మరకతోరణం తయారీలో చందు, సతీష్‌తో పాటు ప్రత్తిపాటి బుల్లెబ్బాయి, బచ్చు లక్ష్మీ, సామస్ అర్జున్‌రావు, కాలిశెట్టి శ్రీరామ చంద్రమూర్తి, లక్ష్మణరావు, కనకాల సూరిబాబు, వెదురుపాక మల్లేశ్వరరావు, మల్లాడి రామ్‌గోపాలరావు తదితరులు సహకరించారు.

వేసవి శిబిరంలో పాఠాలూ నేర్చుకోవాలి

కరప: వేసవి సెలవుల్లో గ్రంథాలయానికి వచ్చి, ఆట పాటలతో పాటు ఇంగ్లీషు, లెక్కలు, సైన్సు నేర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీరామారావు పేర్కొన్నారు. మండలం వలసపాకల, కరప శివారు రామకంచిరాజునగస్‌కాలనీలో శుక్రవారం వేసవి వినోదం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, ఆయా సబ్జెక్టుల గురించి వివరించి, మూలసూత్రాలను వివరించి, అవగాహన కల్పించారు. 'ఒరిగామి' గురించి వివరించి పేపర్‌తో క్యాప్‌లు, వివిధ రకాలు వస్తువుల తయారీని, దేశ భక్తి గీతాలను విద్యార్థులకు నేర్పించారు. వలసపాకల సర్పంచ్ వాసంశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

దొమ్మేటి లేని లోటు తీరనిది

బోట్‌క్లబ్: మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వేంకటేశ్వర్లు మృతి తీరని లోటని రాష్ట్ర శెట్టిబలిజ సంఘ నాయకుడు చొల్లంగి వేణుగోపాల్ అన్నారు. కాకినాడలోని శెట్టిబలిజ సంఘ భవనంలో శుక్రవారం దొమ్మేటి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ మాజీ చైర్మన్ గుత్తుల బుల్లిరాజు మాట్లాడుతూ ఆయన ప్రజా సేవకు అంకితమైన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు నురుకుర్తి వేంకటేశ్వరావు, పెంకె శ్రీనివాసబాబా, యనమదల రవి, కండపల్లి వెంకటరమణ, వాసంశెట్టి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

న్యాయవాది బాలసుబ్రహ్మణ్యం మృతి



కాకినాడలీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ, న్యాయవాది, ఎంపీఎం బాల సుబ్రహ్మణ్యం (72) గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. బార్ అసోసియేషన్‌లో 2018-21 వరకు ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఆయన మృతికి బార్ అసోసియేషన్, బార్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు ముత్తింటి విశ్వేశ్వరరావు, చక్కా ఎస్‌వీ ఎస్ శ్రీనివాస్, కమిటీ సభ్యులు, న్యాయవాదులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ

కరప: మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. శుక్రవారం రెండో రౌండు పోటీలు ప్రారంభమయ్యాయి. నోఏజ్ లిమిట్ విభాగంలో జరిగిన మొదటి మ్యాచ్‌లో పాతర్లగడ్డ జట్టుపై వాకాడజట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా స్వామి(వాకాడ) నిలిచాడు. రెండోమ్యాచ్‌లో అచ్యుతాపురం త్రయం జట్టుపై చొల్లంగిజట్టు గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా గంగాధర్ (చొల్లంగి) నిలిచాడు. మూడో మ్యాచ్‌లో కాజులూరు జట్టుపై పటవలజట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వీరబాబు (పటవల) నిలిచాడు. నాలుగో మ్యాచ్‌లో శీల జట్టుపై గోవలంక జట్టు విజయకేతనం ఎగురవేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా కేవీ రమణ (గోవలంక) నిలిచాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ సభ్యులతో కలసి మచ్చా చంటి, నవీన్, తేలు శంకర్ అందజేశారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి గల్లంతు

కాకినాడ క్రైం: చేపల వేటకు వెళ్లిన ముగ్గురిలో ఓ వ్యక్తి సముద్రంలో గల్లంతయ్యాడు. అతడి జాడ కానరాకపోయే సరికి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ దుమ్ములపేటకు చెందిన కోమటి అప్పలస్వామి, మైలపల్లి రాజు, వాసుపల్లి వాసు గురువారం రాత్రి ఇంట్లో వండుకునేందుకని చేపలు పట్టడానికి వెళ్లారు. కుంభాభిషేకానికి కొంత దూరం వెళ్లే సరికి వీరు ప్రయాణిస్తున్న కర్ర తెప్ప అలల ఉధృతికి తిరగబడింది. ఈ ఘటనలో మైలపల్లి రాజు, వాసుపల్లి వాసులను సమీపంలో ప్రయాణిస్తున్న మరో బోటు లోని మత్స్యకారులు కాపాడారు. గల్లంతైన 48 ఏళ్ల కోమటి అప్పలస్వామి జాడ మాత్రం కానరాలేదు. దీంతో అప్పలస్వామి కుమారుడు అప్పన్న శుక్రవారం రాత్రి కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సూర్యదేవా.. శాంతించుమా..



నిర్మానుష్యంగా ఉన్న కరప-అరట్లకట్ట రహదారి



కర్ఫ్యూను తలపిస్తున్న కరప-కాకినాడ రహదారి

- కొనసాగుతున్న వడగాడ్పులు
- భీతిల్లుతున్న వృద్ధులు, చిన్నారులు
- ప్రతాపం చూపుతున్న రోహిణికార్తె
- పట్టుకుంటే కాలుతున్న గృహోపకరణాలు
- సాయం సంధ్యలోనూ వీడని వేడిగాలులు

కరప: ప్రచండ భానుడు ఉగ్రరూపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. పదిరోజులుగా కొనసాగుతున్న వడగాడ్పులకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలోని పలుగ్రామాల్లో గురువారం నాటి ఎండలకు జడిసి వృద్ధులు, పిల్లలు తారెత్తారు. పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 41 నుంచి 43 డిగ్రీలకు పైబడి నమోదవుతుండటంతో వడగాడ్పులు భరించలేకపోతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రంగా ఉండడంతో ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. సాయంత్రం ఆరు గంటలకు కూడా ఎండ తీవ్రత తగ్గడంలేదని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు. కరప, నడకుదురు, వేళంగి, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, అరట్లకట్ట తదితర గ్రామాల్లో మధ్యాహ్నం 11 గంటలకే దుకాణాలన్నీ మూతపడుతున్నాయి. ఇళ్లలోని వాటర్ ట్యాంకుల్లో నీరు వేడెక్కిపోతోంది. గృహోపకరణాలు సైతం వేడెక్కిపోతూ ఎండ తీవ్రతకు అద్దం పడుతున్నాయి. అత్యవసర పనులున్నవారు తప్పించి, వివాహాది శుభకార్యాలకు సైతం వెళ్లడం మానుకుంటున్నారు. నైరుతి రుతుపవనాలు రావాలని, వాతావరణం చల్లపడేందుకు వర్షాలు పడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పేదల సొంతింటి కల సాకారం



పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- రాష్ట్రంలో 32 లక్షల పట్టాలు ఇచ్చిన ఘనత జగనన్నదే
- మాజీ మంత్రి కురసాల కన్నబాబు
- 120 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

కాకినాడ రూరల్: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలు ఉండకూడదని 32 లక్షల ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని పి.వెంకటాపురం గ్రామస్తుల కోసం సమీపంలో పండూరు వద్ద సుమారు మూడున్నర ఎకరాల్లో ఏర్పాటు చేసిన లే అవుట్‌లో శుక్రవారం 120 మందికి కన్నబాబు పట్టాలు పంపిణీ చేశారు. గ్రామస్తులందరూ ఒకే చోట ఉండాలని కోరుకోవడంలో కలెక్టర్ అనుమతితో పండూరులో ప్రత్యేకంగా స్థలాలు ఇచ్చామన్నారు. మండలంలో నేమాం, పండూరు, తిమ్మాపురం గ్రామాల్లో జగనన్న లే అవుట్లలో ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో సుమారు 30 వేల మంది ఇళ్లు నిర్మించుకుని ఇక్కడకు రానున్నారు. ప్రభుత్వం ఇచ్చిన విలువైన ఆస్తిని ఎవరికీ విక్రయించవద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, పి.వెంకటాపురం, పండూరు ఉప సర్పంచ్‌లో పెంకే సోమరాజు, వలవల వెంకటేశ్వరరావు, పండూరు ఎంపీటీసీ నందిపాటి వెంకట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- కూరాడలో గడప గడపకూ..



కూరాడలో లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: ఏమ్మా పింఛన్ అందుతోందా.. పథకాలు అందుతున్నాయా.. నేను మీ ఎమ్మెల్యే కన్నబాబుని అంటూ ఆత్మీయంగా ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ కూరాడలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. సర్పంచ్ వాసంశెట్టి కొండ, పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు గుత్తుల శాంతి, ఉపసర్పంచ్ రావుల శ్రీను, వెలుగుబంట్ల నారయ్య, గుత్తుల బాలాజీ తదితరులతో కన్నబాబు ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఈ సందర్భంగా కొందరు తమ ప్రాంతంలోని సమస్యలను వివరించగా అన్నింటీ త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, జి.భావారం సర్పంచ్ రొక్కాల గణేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, మార్నెళ్ల వెంకటరమణ, రొక్కాల తారకేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకూ

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. మండలం పెదకొత్తూరు కాలనీలో శుక్రవారం ఆమె సర్పంచ్ చింతా నాగలక్ష్మితో కలసి రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు చెప్పిన సమస్యలపై ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. గ్రామ కార్యదర్శి పి.వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, చింతా బుజ్జి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించండి

కాకినాడ రూరల్: మండలంలోని పి.వెంకటాపురం గ్రామంలో పొలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌ను తొలగించాలని వీఆర్వో రామ్మోహన్ చౌదరికి పితాని దివాకర్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలో హైవే రోడ్డుకు ఆనుకుని సర్వే నంబరు 182/1లో రైతులు పంట పొలాల మధ్య వేసిన రేకుల షెడ్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని, దానిని వెంటనే తొలగించాలని కోరారు.

నేరాల నిరోధానికి 'వారధి'

కాకినాడ: నేరాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మూడో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఏకే కృష్ణ భగవాన్ తెలిపారు. 34వ వార్డులో నేరాలకు సంబంధించి శుక్రవారం రాత్రి వార్డు ప్రజలకు నేరాలు నిరోధించేలా పోలీసు 'వారధి' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ యాప్, రోడ్డు ప్రమాదాలు, పోక్సో చట్టాలు, యువతపై సోషల్ మీడియా ప్రభావం, మహిళలపై జరుగతున్న నేరాలు వాటిపై వివరించి, ముందస్తుగా తీసుకునే జాగ్రత్తలు తెలిపారు. ఎండీ అజ్జూ, ఎస్ఐ అబ్బారెడ్డి, వార్డు పరిపాలనా కార్యదర్శి బి.నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలే విజ్ఞాన నిలయాలు

బాలాజీచెరువు: గ్రంథాలయాలే విజ్ఞాన నిలయాలని రచయిత మంచికంటి వేంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా బైక్ ర్యాలీ చేస్తున్న ఆయన శుక్రవారం సాయంత్రం కాకినాడ ప్రధాన గ్రంథాయానికి వచ్చారు. ఆయన మాట్లాడుతో సాంకేతికత పుణ్యమా అని విద్యార్థుల్లో పుస్తక పఠన శక్తి తగ్గిపోతొందని, రాష్ట్ర వ్యాప్తంగా 2500 కిలోమీటర్లు 26 జిల్లాలో తన ద్విచక్రవాహనంపై పర్యటించాలని నిశ్చయించుకున్నానని, అనంతరం విజయవాడలో బహిరంగ సభ నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో రచయితలు కృష్ణశ్రీ, అద్దేపల్లి ప్రభు, గదుల నారాయణరావు, ములంపాక శ్రీనివాసరావు, రవి పాల్గొన్నారు.



మరో గ్రంథాలయ ఉద్యమనేత వేంకటేశ్వర రెడ్డికి స్వాగతం పలికిన గ్రంథాలయాధికారులు

సంక్షిప్తంగా..

ఉప్పలంకలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ



ఉప్పలంకలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్

కరప: మండలం ఉప్పలంలో శుక్రవారం హనుమాన్‌దళ్ (కాకినాడ) ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని పద్మశ్రీ పురస్కార గ్రహీత, సంకురాత్రి ఫౌండర్ సంకురాత్రి చంద్రశేఖర్ శుక్రవారం ఆవిష్కరించారు. హిందూ హృదయ సామ్రాట్ ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగి 350 ఏళ్లయిన సందర్భంగా హనుమాన్ దళ్ ప్రతినిధులు, భక్తులు కాకినాడ నుంచి ఊరేగింపుగా ఉప్పలంక చేరుకుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి, ఎంపీటీసీ సభ్యుడు కాలాడి కామేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, మాజీ సర్పంచ్ బొమ్మిడి శ్రీను, హనుమాన్ దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నీరుగారుతున్న స్వచ్ఛభారత్ లక్ష్యం

బోట్‌క్లబ్: స్వచ్ఛభారత్ లక్ష్యాన్ని నగరపాలక సంస్థ అధికారులు తూట్లు పొడుస్తున్నారని, బీజేపీ యువమోర్చా నాయకుడు, రాష్ట్ర స్వచ్ఛభారత్ కన్వీనర్ గౌతు చిన్నా మండిపడ్డారు. నగరంలోని గాంధీనగర్, సర్పవరం జంక్షన్, భానుగుడి ప్రాంతాల్లోని స్వచ్ఛభారత్ నిధులతో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను ఆయన శుక్రవారం పరిశీలించారు. స్వచ్ఛభారత్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం నెరవేరడం లేదన్నారు. మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కాకినాడ-అరుణాచలం ఆర్టీసీ సర్వీసు ప్రారంభం



అరుణాచలం సర్వీసును ప్రారంభించిన జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు

కాకినాడ: కాకినాడ నుంచి అరుణాచలానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసును అధికారులు శుక్రవారం స్థానిక డిపోలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం, కంచి దర్శనం అనంతరం 5వ తేదీ రాత్రికి కాకినాడ చేరుకుంటుంది. కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, కాకినాడ డిపో అసిస్టెంట్ మేనేజర్ టి బాలకృష్ణ, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు మజ్జిగ వితరణ



ఉపాధిహామీ కూలీలకు సర్పంచ్ శ్రీనుబాబుతో కలసి మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కరప: మండలం గొడ్డటిపాలెంలో శుక్రవారం సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు సమకూర్చిన మజ్జిగను ఎస్ఐ నౌదు రామకృష్ణ ఉపాధి కూలీలకు పంపిణీ చేశారు. శ్రీనుబాబు తండ్రి వాసంశెట్టి వెంకట్రావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా కూలీలకు చల్లని మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఇవ్వడం అభినందనీయమని ఎస్ఐ తెలిపారు. తర్వాత ఉపాధి కూలీలతో వారధి కార్యక్రమాన్ని నిర్వహించి, రహదారి భద్రతా నియమాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, కూలీలకు అవగాహన కల్పించారు. ఏఎస్ఐ వి.సూరిబాబు, ఏఎన్ఎం చంద్రకళ పాల్గొన్నారు.

రోగికి పింఛన్ అందజేత



నారాయణస్వామి వేలి ముద్రలు తీసుకుంటున్న వెల్ఫేర్ అసిస్టెంట్ అపర్ణ

కరప: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో అనారోగ్యంతో వైద్యం చేయించుకుంటూ, అనారోగ్యంతో ఉన్న రోగికి వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛన్ అందజేశారు. మండలం ఉప్పలంక గ్రామానికి చెందిన పట్టా నారాయణస్వామి వారం రోజులుగా ఆస్పత్రిలో కోమాలో ఉండి చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకుని వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ స్పందించి వెల్ఫేర్ అసిస్టెంట్ అపర్ణకు తెలియజేశారు. ఆమె సతీష్‌తో పాటు శుక్రవారం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి నారాయణస్వామి వేలిముద్రలు తీసుకుని, పింఛన్ సొమ్ము అందజేశారు.

పటవల లే అవుట్‌లో ఏడీసీ పరిశీలన

- చొల్లంగి, పటవల లే అవుట్లను సందర్శించిన అదనపు కమిషనర్



లే అవుట్‌లో రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఏడీసీ నాగ నరసింహారావు

కాకినాడ: నగరపాలక సంస్థ 14 నుంచి 26 డివిజన్ల గృహ లబ్ధిదారులకు చొల్లంగి, పటవల ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి అక్కడ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావు తెలిపారు. శుక్రవారం పటవల, చొల్లంగి లే అవుట్లలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఈ లే అవుట్లలో లెవెలింగ్, రహదారుల నిర్మాణాలు, రాళ్ల పాతుతున్నామని తెలిపారు. ప్రతి లే అవుట్‌లో సర్వే రాళ్లపై ప్లాట్ నెంబర్ స్పష్టంగా కనబడేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బందికి తాగునీటి సౌకర్యం తాత్కాలిక షెడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. త్వరలో ఈ లే అవుట్ల పంపిణీకి కార్యాచరణ రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్ఓ మానే కృష్ణమోహన్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలసిన డీఎస్‌వో ప్రసాద్

కాకినాడ సిటీ: జిల్లా పౌరసరఫరాల అధికారిగా ఎంపీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రసాద్ తూర్పుగోదావరి జిల్లా పౌరసరఫరాల శాఖలో ఏఎస్‌వోగా పని చేస్తూ పదోన్నతిపై కాకినాడ జిల్లాకు వచ్చారు.

సూక్ష్మ సేద్యం అధికారిగా..

కాకినాడ జిల్లా సూక్ష్మ సేద్యం (ఏపీఎంఐపీ) అధికారిగా జీవీవీపీ ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి బదిలీపై కాకినాడ జిల్లాకు వచ్చారు.

మూడు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి



అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షిస్తున్న సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పనుల ప్రగతిపై ఇంజినీర్లతో సమీక్ష

కాకినాడ: టెండర్లు పూర్తయిన అభివృద్ధి పనులను మూడు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి నగరపాలక సంస్థ అధికారులను కోరారు. స్థానిక డి కన్వెన్షన్‌హాలులో నగరంలో జరుగుతున్న, ప్రతిపాదించిన వివిధ అభివృద్ధి పనుల ప్రగతిపై ఆయన సమీక్షించారు. నగరంలోని అనేక ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు సహా ఆయా పనులు ఏఏ దశల్లో ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకుని సత్వరమే పూర్తి చేయాలన్నారు. అలాగే కొత్తగా టెండర్లు పిలిచిన పనులను కూడా మూడు నెలల్లో ప్రారంభించాలన్నారు. కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, సూపర్‌బజార్ చైర్మన్ ముమ్మిడి గోవిందు, నగరపాలక సంస్థ ఎస్ఈ టి.సత్యకుమారి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ ఎం.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగిలో పట్టాల పంపిణీకి ఏర్పాట్లు

నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో నగరంలోని 14 నుంచి 27వ డివిజన్ వరకు ఉన్న గృహనిర్మాణ లబ్ధిదారులకు ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు స్థలాల పంపిణీ చేపడుతున్నట్టు ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చెప్పారు. ఈ అంశంపై ఏడీసీ సీహెచ్ నాగ నరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలసి ఆయన శుక్రవారం సమీక్షించారు. జగన్నాథపురం ప్రాంతానికి చెందిన మొత్తం 5501 మంది లబ్ధిదారుల కోసం 112 ఎకరాలను కేటాయించి చొల్లంగి లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు అప్పగించనున్నామన్నారు. మూడు రోజుల పాటు ఉదయం, సాయంత్రం వెయ్యి మంది చొప్పున తీసుకువెళ్లి స్థలాలను చూపిస్తామన్నారు. ఈ మేరకు ఆయన అధికారులతో సమీక్షించారు. ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలి

అధికారులకు ఆర్డీఓ రమణ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బీవీ రమణ

కాకినాడ సిటీ: రెవెన్యూ, పోలీస్, మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ, పీఎన్‌డీటీ) చట్టం అమలుకు కృషి చేయాలని కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి బీవీ రమణ అన్నారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టం నిషేధ చట్టం–1994 అమలుపై శుక్రవారం ఆయన కార్యాలయంలో సమీక్షించారు. డివిజన్ పరిధిలో చట్టం అమలు తీరు, స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు తదితరాలకు సంబంధించి వివరాలను ఆయా శాఖల అధికారులతో చర్చించారు. గుర్తింపు పొందిన 101 స్కానింగ్ సెంటర్లలో 10 ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నాయని, అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యనేరమని, నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆర్డీవో బీవీ రమణ స్పష్టం చేశారు. ప్రతి స్కానింగ్ సెంటర్లలో ఫిర్యాదుకు సంబంధించి 1800–425–3365 టోల్‌ఫ్రీ నంబరు, స్కానింగ్ ధరల పట్టికను ప్రదర్శించేలా చూడాలన్నారు. డీఐవో ఐ.ప్రభాకర్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ కృష్ణారావు, జీజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్లు ఇందిర, శైలజా, పిఠాపురం పీడియాట్రీషన్ డాక్టర్ ఎం కీర్తి ప్రియ, పెద్దాపురం ఏసీడీపీవో ఎ జ్యోతి, ఎన్‌జీవో ప్రతినిధి కె సింహాద్రి, తాళ్లరేవు, పిఠాపురం సీడీపీవోలు వి.మాధవి, ఎస్‌కె దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.